
సాక్షి గుంటూరు

శుక్రవారం, 15, మార్చి, 2024



ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

ఈపూరు : బొగ్గరంలో ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు స్వామిని దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 513.90 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దుర్గమ్మకు వెండి గంగాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు నగరానికి చెందిన భక్తులు 12.5 కిలోల వెండి గంగాళాలు, మూతలను గురువారం అందించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్ర)	సహరి (శని)
గుంటూరు	6.23	4.59
చిలకలూరిపేట	6.26	5.00
బాపట్ల	6.23	4.59

న్యూస్‌రీల్

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గురువారం విడుదల చేశారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ధ్రువపత్రాలతో అందజేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టును గుంటూరు వైద్య కళాశాల నోటీసు బోర్డులో, గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

దేశమ్మ తల్లి ఆలయానికి భూమిపూజ



పెదకూరపాడు: తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ వారి రూ.10 లక్షల ఆర్థిక సహాయంతో మండలంలోని 75 త్యాళ్ళూరులో గ్రామ దేవత దేశమ్మ తల్లి ఆలయానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చిర్రా శ్రీనివాసరెడ్డి, వజ్రాల శ్రీనివాసరెడ్డి, ములకా వెంకటరెడ్డి, చిర్రా రాఘవరెడ్డి, అల్లం మాధవరెడ్డి, ఈదా సాంబిరెడ్డి, కొల్లి లింగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మికత భావం పెంపొందించేందుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో శ్రీవాణి ట్రస్ అందించిన ఆర్థిక సహాయంతో దేవాలయం నిర్మాణం త్వరితగతి పూర్తి చేస్తామని తెలిపారు.

నేడు ఐఎంఏలో సీఎంఈ

గుంటూరు మెడికల్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ ఆధ్వర్యంలో గుంటూరులోని ఐఎంఏ హాలులో శుక్రవారం నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సీఎంఈ) నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. హైపో థైరాయిడిజం – వంధ్యత్వం అనే అంశంపై ఎండ్రోకినాలజిస్ట్ డాక్టర్ లావణ్య కటకం, వంధ్యత్వం చికిత్సలో ఆధునిక పద్ధతులు అంశంపై డాక్టర్ స్వప్న శ్రీకాంత్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు. వైద్యులందరూ ఈ కార్యక్రమానికి హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

18 నుంచి ఒంటి పూట బడులు

గుంటూరు ఎడ్యుకేషన్ : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒక్కపూట తరగతులు నిర్వహించాలని డీఈవో పి.శైలజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మధ్యాహ్నం 12.30 తరువాత అందించాలని హెచ్ఎంలను ఆదేశించారు. ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఎస్ఏ-2 పరీక్షలను గతంలో ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలని, చెట్ల కింద, ఖాళీ ప్రదేశాల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. టెన్త్ పరీక్షలు జరిగే కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించేందుకు వీల్లేదని, ఆయా పాఠశాలల్లోని ఒకటి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 23 మధ్య కాలంలో అందుబాటులో ఉన్న సెలవు దినాల్లో విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు తరగతులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6500, గరిష్ట ధర రూ.8200, మోడల్ ధర రూ.7300 వరకు పలికింది.

అధునాతనం.. అద్భుతం

- నాడు–నేడు ద్వారా రూ.1.32 కోట్ల వ్యయంతో గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆధునికీకరణ
- ఇంటర్మీడియెట్ విద్యకు మహర్దశ
- 1,100 మంది విద్యార్థినులతో ఉమ్మడి జిల్లాస్థాయిలో ఇదే అతిపెద్ద కళాశాల
- నాడు–నేడు ద్వారా ఆధునిక వసతుల కల్పన
- తరగతి గదుల విద్యుద్దీకరణ, గ్రానైట్‌తో ఫ్లోరింగ్, మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు
- విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా 42 టాయిలెట్లతో బ్లాక్ నిర్మాణం



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల తరగతిగదుల సముదాయం (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: శిథిల భవనాలు, పెచ్చులూడి పడుతున్న సీలింగ్, గతుకులమయంగా ఉండే ఫ్లోరింగ్, టాయిలెట్‌కు వెళ్లాలంటే దుర్గంధంతో ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి. ఇవి గత ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ కళాశాలల్లో నిత్యకృత్యమైన పరిస్థితి. అభివృద్ధి అనేది మచ్చుకైనా కనిపించకుండా దశాబ్దాల తరబడి కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మరుక్షణమే విద్యారంగ స్వరూపాన్ని సమూలంగా మార్చివేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు ప్రారంభించారు. ఆయన చొరవతో ప్రభుత్వ కళాశాలలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి.

నాడు–నేడుతో విప్లవాత్మక మార్పులు

ఒకనాడు వసతుల లేమితో ప్రవేశాలు కరువై దీనావస్థలో ఉన్న గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని ఆధునిక వసతుల్ని సంతరించుకుంది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్ని కలలో సైతం ఊహించని విధంగా ఆధునికంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం జూనియర్ కళాశాలల రూపురేఖల్ని మార్చి వేసింది. గుంటూరు నగర నడిబొడ్డున సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల చరిత్రలో ఎన్నడూ చూడని రీతిలో ఆధునిక హంగుల్ని సంతరించుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో అత్యధికంగా 1,100 మంది విద్యార్థినులతో కొనసాగుతున్న అతిపెద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రత్యేకంగా బాలికల కోసం ఉన్న ఏకైక కళాశాల సైతం ఇదే కావడం విశేషం.



తరగతి గదిలో విద్యార్థినులు (ఫైల్)

ఉమ్మడి గుంటూరు జిల్లా నలుమూలల నుంచి పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు. మౌలిక వసతుల కల్పన ఊసే లేకుండా దశాబ్దాల తరబడి కొనసాగిన కళాశాల రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన ఫలితంగా నాడు–నేడు రెండో దశలో ఆధునికీకరణ బాట పట్టింది.

రూ.1.32 కోట్లతో ఆధునికీకరణ

నాడు–నేడు ద్వారా మంజూరు చేసిన 1.32 కోట్లతో కళాశాలలో అభివృద్ధి పనుల్ని చేపట్టారు. తరగతి గదుల ఆధునికీకరణ, విద్యుద్దీకరణ, సీలింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేయడంతో పాటు సాధారణ గచ్చుస్థానంలో గ్రానైట్‌తో ఫ్లోరింగ్, విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా రెండస్తుల్లో 42 టాయిలెట్లతో కూడిన బ్లాక్ నిర్మించారు. సురక్షితమైన తాగునీటిని అందించేందుకు మూడు ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఏ చిన్న సదుపాయం కల్పించాలన్నా దాతల సహకారంపై ఆధారపడి దశాబ్దాల తరబడి కళాశాలను నడుపుతున్న అధ్యాపక బృందం ఇక ఎవ్వరి అవసరం లేకుండా విద్యార్థినులకు అవసరమైన సకల వసతుల్ని కల్పించింది.

విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు



గతంలో వసతుల లేమితో కొట్టుమిట్టాడిన కళాశాల ప్రస్తుతం ఆధునిక హంగులతో అభివృద్ధికి నోచుకుంది. నాడు–నేడు ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కళాశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాం. తరగతి గదుల్ని పటిష్టపరచి, విద్యుద్దీకరణ సదుపాయంతో పాటు ఎల్ఈడీ లైట్లు, సీలింగ్ ఫ్యాన్లు, టాయిలెట్లలో బ్రాండెడ్ శానిటరీ సామగ్రి ఏర్పాటు చేశాం. గ్రానైట్‌తో ఫ్లోరింగ్‌తో పాటు సురక్షితమైన తాగునీటి కోసం మూడు ఆర్వో వాటర్ ప్లాంట్లను ప్రభుత్వం సరఫరా చేసింది.

గర్నెపూడి సునీత, ప్రిన్సిపాల్

ఇంటర్‌బోర్డు ప్రాంతీయ కార్యాలయ ఆధునికీకరణ



గుంటూరు సాంబశివపేటలోని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని సైతం ప్రభుత్వం ఆధునికీరించింది. ఆర్ఐవో కార్యాలయంతో పాటు డీవీఈవో, ఆర్జేడీ కార్యాలయాలు ఇదే భవనంలో ఉన్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో ఫ్లోరింగ్, భవన పటుత్వాన్ని పరిరక్షించే విధంగా ప్యాచ్ వర్క్‌లు, టాయిలెట్ల నిర్మాణ పనులతో పాటు పెయింటింగ్‌తో ఆహ్లాదకరంగా మారింది. దశాబ్దాల తరబడి వసతుల లేమితో కొట్టుమిట్టాడిన ఆర్ఐవో, ఆర్జేడీ, డీవీఈవో కార్యాలయాల భవన సముదాయం ప్రభుత్వం చొరవతో ఆధునికీకరణకు నోచుకుంది.

'పెమ్మసాని'కి కాపు సంఘాల నిరసన సెగ



పెమ్మసానితో బొక్కిసం శివరాం, కాపు సంఘాల నేతలు

తెనాలి: గుంటూరు పార్లమెంటు తెలుగుదేశం అభ్యరిర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు కాపుల నిరసన సెగ తగిలింది. పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గంలో ఏ ఒక్క అసెంబ్లీ సీటును కూడా కాపులకు కేటాయించకపోవడంతో సంఘాల నేతలు పెమ్మసాని ర్యాలీలో నిరసన గళం వినిపించారు. రెండు రోజుల్లో అభ్యర్థిని ప్రకటించకపోతే పార్లమెంటు సహా ప్రతి అసెంబ్లీలోనూ కాపు రెబెల్ అభ్యర్థులు రంగంలో ఉంటారని హెచ్చరించారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గురువారం రాత్రి రూరల్ మండలం అంగలకుదురులో ప్రచార రథంపై ర్యాలీగా బహిరంగ సభకు వెళుతుండగా కాపు సంఘాల నేతలు అడ్డుకున్నారు. జై కాపు, జైజై కాపు అంటూ నినాదాలు చేశారు. దీనితో పెమ్మసాని చంద్రశేఖర్ రథంపై దిగి వారి వద్దకు వచ్చారు. గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో కాపుల్ని చిన్నచూపు చూస్తున్నారని, తమను నిర్లక్ష్యం చేయడం మంచి పద్ధతికాదని సంఘాల నేతలు స్పష్టంగా చెప్పారు. తప్పనిసరిగా ఏదొక సీటును కేటాయించాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకుంటామని ఏపీ స్టేట్ కాపు రాజకీయ చైతన్య వేదిక అధ్యక్షుడు బొక్కిసం శివరాం అల్టిమేటం జారీచేశారు. వీరితో పీఆర్ కాపునాడు అధ్యక్షుడు సంకట లక్ష్మీనారాయణ, కాపునాడు జోన్-3 అధ్యక్షుడు బొందలపాటి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి రాగం సదాశివరావు, అధ్యక్షుడు దాసరి రంగారావు, కాపు జేఏసీ అధ్యక్షుడు అమ్మ శ్రీనివాసనాయుడు ఉన్నారు.

భగ్గుమన్న 'కొమ్మాలపాటి' వర్గం



గుంటూరులో ఆందోళన చేస్తున్న కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు



అవమాన భారంతో గుంటూరు నుంచి హైదరాబాద్ పయనమైన శ్రీధర్

- భాష్యం ప్రవీణ్‌కు సీటు కేటాయించడంతో తీవ్ర నిరాశలో కొమ్మాలపాటి శ్రీధర్
- కనీసం పిలిచి మాట్లాడలేదని అనుచరుల వద్ద ఆవేదన
- కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలిసేందుకు వెళ్లిన ప్రవీణ్...కొద్దిసేపు ఉద్రిక్తత
- టికెట్ ఇవ్వకముందే ఎందుకు హడావుడి చేశావని ప్రవీణ్‌పై ఆగ్రహం
- పార్టీలోనే ఉంటే సహకరిస్తానని చెప్పి హైదరాబాద్ వెళ్లిన శ్రీధర్
- శ్రీధర్ వర్గంపై బెదిరింపులకు పాల్పడుతున్న ప్రవీణ్ వర్గం

సాక్షి, నరసరావుపేట, పెదకూరపాడు: టీడీపీ రెండో జాబితాలో పెదకూరపాడు స్థానం భాష్యం ప్రవీణ్‌కు కేటాయించడంపై మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ అనుచరులు ఒకసారిగా భగ్గుమన్నారు. టికెట్ కొమ్మాలపాటికే కేటాయిస్తారని ముందుగా గుంటూరులోని నివాసానికి గురువారం ఉదయం ఆయన అనుచరులు భారీగా చేరుకున్నారు. స్వీట్లు, బాణసంచా కూడా సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం టీడీపీ టికెట్ భాష్యం ప్రవీణ్‌కు కేటాయిస్తున్నట్లు పార్టీ అధినేత చంద్రబాబు ప్రకటించడంతో ఒకసారిగా కొమ్మాలపాటి శ్రీధర్ వర్గీయులు ఆందోళన చేపట్టారు. ఆయనకే టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు.

భాష్యం ప్రవీణ్‌పై కార్యకర్తల ఆగ్రహం

టీడీపీ టికెట్ ప్రకటించిన కొద్దిసేపటికి భాష్యం ప్రవీణ్ గుంటూరులోని కొమ్మాలపాటి శ్రీధర్ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఆందోళన చేస్తున్న కార్యకర్తలు ఆయన్ను చూసి మండిపడ్డారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అచ్చంపేటకు చెందిన టీడీపీ కార్యకర్తలు ప్రవీణ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ కేటాయించకముందే నియోజకవర్గంలో ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లతో హడావుడి ఎందుకు చేశారు అని ప్రశ్నించారు? స్థానికేతరుడు అంటూ నినాదాలు చేశారు. దీంతో ఒకసారిగా భాష్యం ప్రవీణ్ టీడీపీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకెందుకు.. ఏమైనా ఉంటే మేము మేము చూసుకుంటాం..మీరెవ్వరు ? అంటూ గట్టిగా అరవడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. ఇదే సమయంలో కొమ్మాలపాటి తన అనుచరుల్ని సముదాయించారు.

కనీస గౌరవం దక్కలేదు

టికెట్ దక్కకపోవడంపై కొమ్మాలపాటి శ్రీధర్ ముఖ్య అనుచరుల వద్ద జరిగిన అన్యాయంపై వాపోయారట. వరుసగా నాలుగు పర్యాయాలు పెదకూరపాడులో టీడీపీ ఓడిపోతూ అభ్యర్థులు కరువైన సమయంలో 2009లో పోటీ చేసి గెలిచానని, పార్టీ కోసం 18 సంవత్సరాలు కష్టపడితే ఇదేనా దక్కిన గౌరవం అంటూ ఆవేదన చెందారట. పార్టీ కోసం ఎంతో డబ్బు ఖర్చు చేసినా చంద్రబాబు కనీసం పిలిచి మాట్లాడకపోవడం అన్యాయమన్నారట. నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపి శ్రీధర్ హైదరాబాద్ వెళ్లిపోయారు.

పార్టీలో ఉంటే సహకరిస్తా !

కొమ్మాలపాటి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన భాష్యం ప్రవీణ్ రాబోయే ఎన్నికల్లో సహకరించాలని కోరారట. దీనికి స్పందనగా శ్రీధర్ మాట్లాడుతూ.. పార్టీలోనే ఉంటే కచ్చితంగా సహకరిస్తానని, ఏమి జరుగుతుందో కాలమే నిర్ణయిస్తుందంటూ సమాధానం చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో అవాక్కైన ప్రవీణ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బెదిరింపులకు తెరలేపిన ప్రవీణ్ వర్గీయులు

ధరణికోటకు చెందిన వద్దినేని సంజయ్ ఇటీవల కొమ్మాలపాటికే టికెట్ అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. గురువారం అధిష్టానం ప్రవీణ్‌కు సీటు కేటాయించడంతో ఆయన వర్గానికి చెందిన అచ్చంపేట మండలం వేల్పూరుకు వాసి వంకాలపాటి భాస్కర్ సంజయ్‌కు ఫోను చేసి బెదిరించిన ఆడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పెదకూరపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు వెల్లలచెరువు సురేష్ ఇటీవల భాష్యం ప్రవీణ్‌కు కలవడంతో శ్రీధర్ వర్గీయులు ఆయనపై అసహనం వ్యక్తం చేశారు. టికెట్ ప్రకటించన నేపథ్యంలో .. ఇప్పుడేమంటారని సోషల్ మీడియాలో సురేష్ వీడియో పెట్టారు. ఇలా నియోజకవర్గంలో టీడీపీ రెండు వర్గాలుగా చీలి ఘర్షణ పడుతున్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు తదితరులు

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి
- ఈబీసీ నేస్తంలో 21,687 మంది మహిళలకు రూ.32.53 కోట్లు జమ

గుంటూరు వెస్ట్: పేదింటి మహిళల ఆర్థిక సాధికారత సాధించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు అద్భుతమని కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి కొనియాడారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకంలో భాగంగా అగ్రకుల పేద మహిళలకు బటన్ నొక్కి మూడో విడత నగదును లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేశారు. వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్‌తోపాటు ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు స్థానిక కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన 45–60 ఏళ్ల మధ్య వయస్సున్న అగ్రకుల మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఏటా రూ.15 వేలు వంతున ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. ఈ మొత్తంతో వారు చిన్న చిన్న వ్యాపారులు నిర్వహించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 21,687 మహిళలకు రూ.32.53 కోట్లు లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పేదల జీవన విధానం అభివృద్ధి పథంలో కొనసాగుతుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు కలెక్టర్, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వృద్ధులు, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి నమూనా చెక్కును అందజేశారు.

మూడోసారి నగదు జమ



ప్రతి ఏడాది క్రమం తప్పకుండా ఈ పథకం వస్తోంది. ఇది మూడోసారి. దీంతోపాటు అమ్మ ఒడి కూడా వస్తోంది. మాలాంటి అగ్రకుల పేద మహిళల్ని కూడా గుర్తుంచుకుని జగన్ పథకాలు ఇవ్వడం చాలా గొప్ప విషయం. మా అందరి దీవెన ఆయనకు, ప్రభుత్వానికి ఉంటుంది.

–రాజ్యలక్ష్మి, గుంటూరు

ప్రభుత్వ రుణం తీర్చుకుంటాం



ఇంటి బిడ్డలా మా బాగోగులు చూస్తున్న ముఖ్యమంత్రి రుణం త్వరలోనే తీర్చుకుంటాం. మేమంతా ఒక్కమాట మీద ఉండి గెలిపించుకుని మళ్లీ ఈ పథకాలు తీసుకుంటాం.

– సావిత్రి, గుంటూరు

తేలని పేట పంచాయితీ

- రెండో జాబితాలోనూ నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటించని టీడీపీ
- టికెట్ రాదేమోనన్న ఆందోళనలో బీసీ నేత చదలవాడ అరవింద్‌బాబు
- లావు శ్రీకృష్ణ దేవరాయల వల్లే అంటూ ఆక్రోశం
- గురజాల సీటు యరపతినేనికి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అసమ్మతి వర్గం
- టికెట్ రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో జంగా కృష్ణమూర్తి

సాక్షి, నరసరావుపేట: టీడీపీ రెండు జాబితాలలో పల్నాడులోని ఆరు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. అయితే, ఒక్క నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిత్వంపై మాత్రం పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేకపోతోంది. దీంతో ఈ నియోజకవర్గ టీడీపీ నేతల్లో గుబులు రేకెత్తుతోంది. సరైన అభ్యర్థి దొరక్క అధిష్టానం ఆందోళనలో ఉంటే.. టికెట్ దక్కుతుందో లేదోనన్న భయం ఆశావహుల్లో నెలకొంది. తనకు టికెట్ ఇవ్వరేమోనన్న ఆందోళనలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి చదలవాడ అరవింద్ బాబు ఉన్నారు. గత ఎన్నికలో ఓడిపోయినా ఏమాత్రం ఖర్చుకు వెనుకాడకుండా పనిచేశానని, అయినా తన పేరు జాబితాలో లేకపోవడంపై విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎలాగైనా తనను తప్పించాలని ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రయత్నిస్తున్నారని అనుచరులతో చదలవాడ వాపోతున్నారట. వైఎస్సార్ సీపీలో బీసీ నేతకు టికెట్ ఇస్తామనడంతో పార్టీ మారిన లావు టీడీపీలో ఉన్న ఏకైక బీసీ అభ్యర్థినైన తనకు సైతం టికెట్ దక్కకుండా చూస్తున్నారని మథనపడుతున్నారట. చదలవాడకు అన్యాయం చేస్తే సహించేది లేదని ఆయన వర్గం బాహాటంగానే హెచ్చరిస్తోంది. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు సహకరించేది లేదని తెగేసిచెబుతున్నారు. మరోవైపు ఈ సీటులో బీజేపీ పోటీ చేస్తుందన్న ప్రచారం గురువారం నుంచి నియోజకవర్గంలో ఊపందుకుంది.

యరపతినేనికి టికెట్

తొలి జాబితాలో చోటు దక్కని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు గురువారం విడులైన లిస్టులో పేరు ఉండటంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు. తొలి జాబితాలో పేరు ఇవ్వకుండా చంద్రబాబు అవమానించారంటూ రగిలిపోతున్న విషయం తెలిసిందే. మరోవైపు యరపతినేనికి అభ్యర్థిత్వంపై ఆయన వ్యతిరేక వర్గం మండిపడుతున్నారు. ఎంత చెప్పినా అధిష్టానం తమ మొరను ఆలకించడకుండా మరోసారి టికెట్ ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ముందుగా చెప్పినట్టే యరపతినేనికి ఎన్నికల్లో సహకరించబోమని చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో రహస్యంగా సమావేశమైన భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుందామని ఓ నిర్ణయానికి వచ్చారట.

జంగా భవితవ్యం ప్రశ్నార్థకం

వైఎస్సార్‌సీపీకి దూరంగా ఉంటున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి రాజకీయ భవిష్యత్తు ముగిసినట్టేనా అన్న వాదన జిల్లాలో వినిపిస్తోంది. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలతో పాటు టీడీపీలోకి చేరుతున్నారని, గురజాల నుంచి పోటీ చేస్తున్నారంటూ ప్రచారం జరిగింది. ఆ దిశగా ప్రయత్నాలు కూడా జరిగాయి. అయితే, జంగా టికెట్ విషయంపై చంద్రబాబు ఎటూతేల్చకపోవడంతో సొంత మండలం దాచేపల్లిలో జరిగిన రా..కదిలారా కార్యక్రమంలో టీడీపీ కండువా కప్పుకొనే కార్యక్రమం వాయిదాపడింది. అప్పటి నుంచి టీడీపీలోకి వెళ్లాలా వద్దా ? అనే విషయం తేల్చుకోలేక జంగా సతమతమవుతున్నారట. టీడీపీ రెండు జాబితాల్లో పేరు లేకపోవడం, గురజాల సీటు యరపతినేనికి ఇవ్వడం జంగా వర్గంలో మరింత ఆందోళన నెలకొంది. దీంతో గురువారం మధ్యాహ్నం నరసరావుపేటలోని ఎంపీ లావు కార్యాలయానికి వచ్చి శ్రీకృష్ణదేవరాయలతో మంతనాలు జరిపినట్టు తెలుస్తోంది.

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకే ప్రజాదరణ

పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కిలారి రోశయ్య



తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి ప్రజల్లో ఉన్న ఆదరణ టీడీపీకి లేదని పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కిలారి రోశయ్య అన్నారు. గురువారం సీతానగరం అంజనేయస్వామి దేవస్థానంలో మంగళగిరి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మురుగుడు లావణ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి కిలారి రోశయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో పేదలకు పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతోందని, ఆ యుద్ధంలో విజయం సాధించేది వైఎస్సార్ సీపీ అని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించిందని, మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఇప్పటి వరకు 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో టీడీపీలో ఉన్న వారు రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని, టీడీపీ పార్టీ డబ్బులతో గెలవాలని కలలు కంటున్నారని, వారు ఎన్ని కుయుక్తులు చేసినా గెలిచేది వైఎస్సార్ సీపీ అని, మంగళగిరి వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్యకు మంచి ఆదరణ ఉందని, బీసీ మహిళ అయిన లావణ్యను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా పాలన

- ప్రభుత్వ విప్ అప్పిరెడ్డి, మంత్రి విడదల రజిని
- రూ.1.7 కోట్లతో నిర్మించిన జిమ్ ప్రారంభం



ఎన్టీఆర్ స్టేడియంలో జిమ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని, శాసనమండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, మేయర్ కావటి మనోహరనాయుడు తదితరులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని పేర్కొన్నారు. రూ.1.7 కోట్లతో అత్యాధునిక వసతులతో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో నిర్మించిన జిమ్‌ను గురు వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో స్టేడియాన్ని అద్భుతంగా అభివృద్ధి చేశామన్నారు. జిమ్ నిర్మాణంలో ఎన్ని అడ్డంకులు సృష్టించిన సభ్యుల, ప్రజల సహకారంతో వాటిని అధిగమించామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రోత్సాహాలను అందించడంతోపాటు ఔత్సాహిక క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఇటీవల ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిందన్నారు. నిత్యం ఒత్తిడితో కూడుకున్న జీవన విధానంలో కొంతసేపు అయినా వ్యాయామం, క్రీడా సాధన చేయాలన్నారు. దీంతోపాటు రూ.96 లక్షల వ్యయంతో కంకరగుంట గేటు నుంచి లక్ష్మీపురం వరకు నిర్మించిన రహదారి అద్భుతంగా ఉందన్నారు. ప్రజలకు ఇది ఎంతో ఉపయోగంగా మారిందని చెప్పారు. ఇప్పుడు కొంతమంది పొత్తుల పేరుతో నాటకాలు మొదలెట్టారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దేశానికే సంక్షేమ పాలనతో ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, అధికారులు, స్టేడియం సభ్యులు, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

మహానేత విగ్రహావిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ ముఖద్వారం వద్ద జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గురువారం మంత్రి విడదల రజిని, మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సంక్షేమ సంతకంతో చెరిగిపోని జ్ఞాపకం మిగిల్చి, మరణం లేని మహానాయకునిగా, జనం గుండెల్లో సంక్షేమ శ్రామికునిగా మహానేత నిలిచారని అన్నారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకునే ప్రక్రియలో క్రియాశీలకంగా పనిచేస్తామని ప్రతినబూనడం ద్వారా ప్రతి ఒక్కరూ రాజన్నకు నిజమైన నివాళి అర్పించాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం: మంత్రి రజని

రాష్ట్ర వైద్యారోగ్యశాఖా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రతి ఇంటికీ తన సంక్షేమ పథకాలతో చేరువై, అభివృద్ధిని ఆచరణలో అమలు చేసి చూపిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ, దేశంలోనే సంక్షేమం అంటే ఎవరికైనా గుర్తుకొచ్చే మొదటి పేరు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం తన చివరి శ్వాస వరకు పాటుపడిన గొప్ప పరిపాలనాదక్షుడు వైఎస్సార్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ, తిరుమలశెట్టి నరసింహారావు, కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ, అంబేద్కర్, వంశీ, అచ్చాల వెంకటరెడ్డి, వలివీరారెడ్డి, గురవయ్య, మార్కెట్ బాబు, బోడపాటి కిషోర్, రమ్య, వైసీపీ నాయకులు పూనూరి నాగేశ్వరరావు, పానుగంటి చైతన్య, మహేంద్ర గులేచ, మాదాసు కిరణ్, కొత్తపేట సతీష్ పాల్గొన్నారు.

నిబంధనలతో ప్రమాదాల నివారణ

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ నిబంధనలు పాటించి, అధికారులకు సహకరిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చాలా ప్రాణాలు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే పోతున్నాయన్నారు. మన కోసం కుటుంబ సభ్యులు ఉంటారని వారి గురించైనా ఆలోచించాలని కోరారు. గతంతో పోల్చుకుంటే అధికారులు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు మెరుగ్గా ఉంటున్నాయన్నారు. ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదాల వివరాలను ఎప్పటికప్పుడు ఐరాడ్ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం సుదీక్షణ ఫౌండేషన్ ఉచిత కృత్రిమ కాళ్ల పంపిణీ శిబిరం పోస్టర్‌ను కలెక్టర్, ఆర్అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస మూర్తి, డీటీసీ షేక్‌కరీం, జిల్లా అధికారులు ఆవిష్కరించారు.

ముగిసిన ఇంటర్ ప్రథమాధ్యాయం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రధాన సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు గురువారం ముగిశాయి. ఈనెల ఒకటిన పరీక్షలు ప్రారంభమైంది మొదలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయి. జూనియర్ ఇంటర్ పరీక్షలు జరిగిన రోజుల్లో మొత్తం నాలుగు మాల్ ప్రాక్టీసు కేసులు నమోదయ్యాయి. గురువారం జరిగిన జూనియర్ ఇంటర్ కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 33,146 మంది విద్యార్థులకు 32,093 మంది హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన ఆనందంలో పరీక్ష కేంద్రాల నుంచి బయటకు వస్తూనే విద్యార్థులు ఆనందోత్సాహాలతో కనిపించారు. పరీక్ష కేంద్రాల్లో కొత్తగా పరిచయమైన కొత్త మిత్రులకు వీడ్కోలు పలికి, ఆయా విద్యాసంస్థల బస్సులు, వాహనాల్లో వెళుతూ అరుపులు, కేకలతో హుషారెత్తారు.

17న జూనియర్ బాల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): న్యూ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా బాస్కెట్ బాల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు అంకిరెడ్డి పాలెంలోని బాస్కెల్ బాల్ కోర్టులో జూనియర్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.రేవతి, జి.ఆంజనేయులు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2006 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. పోటీలకు వచ్చే వారుఆధార్ తీసుకు రావాలన్నారు.

జిల్లా కమిటీలో పలువురికి చోటు

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ గుంటూరు జిల్లా కమిటీలో పలువురిని పలు పదవుల్లో నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా తాడికొండ నియోజకవర్గంకు చెందిన నాయుడు నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రత్తిపాడు నియోజవర్గంకు చెందిన గంగిరెడ్డి చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శులుగా తాడికొండ నియోజకవర్గానికి చెందిన సుంకర సంజీవరెడ్డి, మర్రి పుల్లారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

డాక్టర్ శారదకు షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు

రేపు తెనాలిలో ప్రదానం



తెనాలి: కరోనా రోజుల్లో బాధితులను వైద్యసేవలను అందించటంతో సహా మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి కోసం కృషి చేస్తూ, ప్రస్తుతం ధర్మ ప్రాజెక్టుతో గోల్డెన్ అవర్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న డీ3 శారద సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారదకు మరో ప్రతిష్ఠాత్మక గౌరవం దక్కనుంది. కెనాడకు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవకురాలు షారోన్ పేరుతో ఇవ్వనున్న షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డు-2024కు ఎంపికయ్యారు. స్థానిక పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంధ సేవాసంస్థ అధ్యక్షుడు ప్రదీప్ దోనేపూడి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఏర్పాటయ్యే ప్రత్యేక సభలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఇటీవల మృతిచెందిన షారోన్ తన జీవితకాలం అంతా ఘన, పెరు లాంటి అతి పేద దేశాల్లోని పేదలకు సేవలను అందించినట్టు ప్రదీప్ తెలియజేశారు. ఆమె గౌరవార్థం ఏటా షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డును బహూకరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. తొలిగా డాక్టర్ శారదకు, వచ్చే ఏడాది అవార్డును జమైకాలో ఉంటున్న భారతీయ వైద్యుడు డాక్టర్ నాగ మల్లేశ్వరరావుకు బహూకరిస్తామని వివరించారు. ఐఎంఏ, తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి తోపాటు పట్టణ ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొంటారని పెన్నీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు.

జగనన్న పాలనలో సామాజిక న్యాయం

- వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి
- గుంటూరులో పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సన్మానం



పీపీలుగా నియమితులైన కోటేశ్వరరావు, కృష్ణలను సత్కరిస్తున్న వెంకటరెడ్డి

పట్నంబజారు: సామాజిక సమతుల్యత పాటిస్తూ న్యాయవాదులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలూరి వెంకటరెడ్డి చెప్పారు. గుంటూరు జిల్లా కోర్టులోని ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.కోటేశ్వరరావు, ఐదోవ అదనపు జిల్లా కోర్టు పీపీగా పల్లపు కృష్ణలను నియమించారు. ఈనేపథ్యంలో గురువారం జిల్లా కోర్టులో అభినందన సభ కార్యక్రమం జరిగింది. పార్టీ నేతలు, న్యాయవాదులు, పెద్ద ఎత్తున హాజరై పీపీలుగా నియమితులైన కోటేశ్వరరావు, కృష్ణలను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పోలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ లా ఆఫీసర్ల నియామకంలో సీఎం వై.ఎస్.జగన్ ఎంతో సమన్యాయంతో ముందుకు సాగారన్నారు. జిల్లా కోర్టులో ఐదుగురు దళితులు, ముగ్గురు మైనార్టీలు, ముగ్గురు బీసీలకు 90 శాతానికి పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పదవులు అందజేశారన్నారు. అదేవిధంగా సీఎంగా వై.ఎస్. జగన్ పగ్గాలు చేపట్టాక న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లతో సహాయ నిధిని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జూనియర్ న్యాయవాదులకు రూ. 5 వేలు చొప్పున స్టయిఫండ్ అందజేసి న్యాయవిభాగంలో న్యాయవాదులకు ఎంతో సహాయ సహకారాలు అందించారన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ తరుపున సీఎం వై.ఎస్.జగన్, లీగల్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.మనోహర్ రెడ్డి, ఎంపీ వి.విజయసాయి రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళిగిరి, పీపీలుగా నియమితులైన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్లీడర్ పోకల వెంకటేశ్వర్లు, పీపీ రాజశేఖరరెడ్డి, వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం జిల్లా అధ్యక్షుడు సి.డి.భగవాన్, న్యాయవాదులు రమణారెడ్డి, మంజుల, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కాపులను అణగదొక్కడమే చంద్ర బాబు పని

నెహ్రూనగర్: గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో 2.70 లక్షలపై చిలుకు ఓట్లు ఉన్న కాపులకు కాదని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 2, 3 శాతం ఉన్న సామాజిక వర్గానికి అధిక సీట్లు కేటాయించడం బాధాకరమని కాపు జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ గురువారం విడుదల చేసిన సీట్లు కేటాయింపులో గుంటూర్లు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక్క కాపు సీటు లేక పోవడంపై మండిపడుతూ విలేకర్ల సమావేశం నిర్వహించారు. కాపునాడు రాష్ట్ర అధ్యక్షులు సంకటి లక్ష్మణరావు మాట్లాడుతూ 25 శాతం ఉన్న కాపులకు ఒక్క సీటు ఇవ్వకపోగా, రెండు మూడు శాతం ఉన్న సామాజిక వర్గాలకు టీడీపీ జనసేన బీజేపీ కూటమి నాలుగు, ఐదు సీట్లు కేటాయించడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు పాలనలో కాపులను అణగదొక్కడమే పనిగా పెట్టుకున్నారని చెప్పడానికి ఇది ఒక నిదర్శనమన్నారు. కాపులను పక్కన పెడితే సహించేది లేదని, చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామనీ, రెండు, మూడు రోజుల్లో కాపు నాయకులతో చర్చలు జరిపి సీటు కేటాయించకపోతే ఇండిపెండెంట్ అభ్యర్థులను నిలబెడతామని అల్టిమేటం జారీ చేశారు. రాష్ట్ర కాపు జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు, నిశ్శంకర అప్పారావు, మిరియాల వెంకట్రావు, కొప్పరాజు మారుతి కిషోర్, సదాశివరావు, ఏనుగుల రమణ, సారోతు శ్రీనివాసరావు, అడపా ప్రసాద్‌బాబు, అమర్నాథ్ పాల్గొన్నారు.